నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

5 మహబూబ్‌నగర్, బుధవారం 17 జూలై 2024 JOGULAMBA GADWAL WANAPARTHY


# పార్టీలో ఉన్నోళ్లకే ప్రాధాన్యం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి
- గ్రామాల్లోని ప్రతి కార్యకర్తనూ కలవాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గట్టు మండల నాయకులతో సమావేశం


గట్టు, జూలై 16 : పార్టీకి వెన్నంటి ఉన్నవారికే మొదటి ప్రాధాన్యం ఉంటుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లోని ఆయన నివాసంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు గద్వాల బీఆర్‌ఎస్ నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో మెలిగి గ్రామగ్రామాన తిరిగి ప్రతి కార్యకర్తను కలువాలన్నారు. పార్టీ పట్టు నిలుపడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటి బీఆర్‌ఎస్ ఉనికిని మరోసారి చాటాలన్నారు. త్వరలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో గద్వాలలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఆంజనేయగౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, అంగడి బస్వరాజు, కురుమ విజయ్‌కుమార్, మోనేశ్, తిరుమలేశ్, బాసు గోపాల్, మందా మల్లికార్జున్, మాల మల్లికార్జున్, నాగరాజు, వీరేశ్, అనిల్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# నేడు తొలి ఏకాదశి

- యోగనిద్రలోకి మహావిష్ణువు
- కార్తీక శుద్ధ ఏకాదశిరోజు మేల్కొలుపు
- ఛాతుర్మాస దీక్షలు ప్రారంభం
- ఆలయాల్లో పూజలు



గద్వాల కోటలోని చెన్నకేశవస్వామి మూలవిరాట్

నాగర్‌కర్నూల్ (నమస్తే తెలంగాణ)/గద్వాలటౌన్, జూలై 16 : ఆషాఢ మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశికి అత్యంత విశిష్టత ఉంది.. ఏడాది ప్రారంభానికి సూచికగా తొలి ఏకాదశిని అభివర్ణించేవారని పురాణాలు చెబుతున్నాయి. శ్రీమహావిష్ణువు ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు యోగనిద్రలో ఉండడంతో తొలి ఏకాదశిని శైన ఏకాదశి అని కూడా అంటారు.. ఈ ఏకాదశి శ్రీ మహావిష్ణువుకు ఎంతో ప్రీతిపాత్రమైంది.. 24 ఏకాదశుల్లో ఉపవాసం చేయలేకపోయిన.. ఒక్క ఈ తొలి ఏకాదశి రోజు దీక్ష చేస్తే కోటి పుణ్యాలకు సాటి అని పండితులు చెబుతున్నారు. ఈ రోజున స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలుగుతాయన్నది నమ్మకం..

ఏడాదికి 24 ఏకాదశిలు ఉంటాయి. ఇందులో మొట్టమొదటిదైన ఏకాదశిని తొలి ఏకాదశిగా, శయన ఏకాదశిగా పిలుస్తారు. విష్ణుమూర్తికి అంకితం చేసే ఏకాదశి అంటారు. ఈ ఏకాదశి మంగళవారం రోజు రాత్రి 8:34 గంటలకు ప్రారంభమై బుధవారం రోజు రాత్రి 9:03గంటలకు ముగుస్తుంది. కనుక ఈ రోజు భక్తులు ఉపవాస దీక్ష చేస్తారు. పురాణాల ప్రకారం.. ఈ రోజు నుంచి విష్ణుమూర్తి పాలకడలిలో విశ్రాంతి తీసుకుంటాడు. నాలుగు నెలల పాటు నిద్రావస్థలో ఉంటాడు. స్థితికారకుడైన విష్ణువు నిద్రను యోగనిద్రగా పేర్కొంటారు. పలువురు ఛాతుర్మాస దీక్షలు ప్రారంభిస్తారు. ఇందులో శ్రావణం, భాద్రపదం, అశ్వినీ, కార్తీక మాసాలుంటాయి. దేవుళ్లు క్షీణించిన శక్తిని ధ్యానం, యోగనిద్ర ద్వారా పునరావాసం చేసుకొంటారు. ఇలా శయన ఏకాదశి రోజున నిద్రించి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజు యోగనిద్ర నుంచి విష్ణుమూర్తి మేల్కొంటారు. అప్పుడు విష్ణుమూర్తి దర్శనం చేసుకుంటే పుణ్య ఫలితాలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి. దీంతో ఈ నాలుగు మాసాలపాటు శివుడి చేతిలో పాలన నిర్వహణ ఉంటుంది. ఈ రోజు ఉపవాస దీక్షకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. బ్రహ్మదేవుని వెనుక భాగం నుంచి రెండు చెమట బిందువులు భూమి మీద పడి అవి అన్నవృద్ధులు అనే రాక్షసులుగా జన్మిస్తారు. ఈ రాక్షసులు బ్రహ్మవద్దకు వెళ్లి నివాసానికి వరం కోరుకుంటే ఏకాదశి రోజు అన్నాదులు భుజిస్తే అందులో కొలువై ఉండాలని వరం ఇస్తారు. దీంతో ఈ రోజు భోజనం చేస్తే శరీరంలో క్రిములు జన్మిస్తాయని ఆ పురాణగాథ. అందుకే ఈ రోజు అన్నం తినవద్దని భక్తుల నమ్మకం. ఈరోజు యక్షుడికి చెప్పిన ఏకాదశి కథను వింటే మంచి జరుగుతుంది. విష్ణువు సృష్టికి పోషణ కారకుడు. ఈ ఏకాదశితోనే అన్ని పండుగలు ప్రారంభమవుతాయి. ఈ ఏకాదశి తర్వాతే నోములు, వ్రతాలు వస్తాయి. ఇందులో ప్రధానమైది శ్రావణమాసం. అందుకు ఈ ఏకాదశి ఉపవాస దీక్ష చేసి గోవుకు పిండి ముద్దలు, గ్రాసం పెట్టి పూజిస్తే విష్ణులోక ప్రాప్తి కలుగుతుంది. బెల్లం పానకం, పిండి పదార్థాలు, తీపి పదార్థాలు విష్ణువుకు ప్రసాదంగా పెట్టడం జరుగుతుంది. ఛాతుర్మాస దీక్షలు చేసే భక్తులకు విష్ణు అనుగ్రహం కలుగుతుంది. ఓం నమో నారాయణాయ నమః అనే అష్టాక్షరి మంత్రం, నిరంతరం హరిహరిహరి అని పూజిస్తే మేలు జరుగుతుంది. ఉసిరి చెట్టుకు సైతం ప్రత్యేకంగా పూజలు చేస్తారు. ఉపవాస దీక్షలో భాగంగా విష్ణు నామస్మరణతో చేస్తూ బ్రాహ్మణులకు అన్నదానంతో ఉపవాసం విరమించాల్సి ఉంటుంది. విష్ణువుకు ఇష్టమైన తులసిని పూజించాల్సి ఉంటుంది. ఏకాదశి వ్రతం విరమించేందుకు తులసీ దళం నోట్లో వేసుకుంటే సరిపోతుంది. ఇక విష్ణువు ఉసిరి చెట్టుపై నివసిస్తాడని భావిస్తారు. అందుకు ఉసిరి కాయలను పూజించడం వల్ల కూడా పిల్లలకు శుభం కలుగుతుంది, ఆరోగ్యం, సంతోషం కలుగుతాయని భక్తుల నమ్మకం. ఏకాదశి ఉపవాసం రోజు మాత్రం అన్నం తినడం నిషేధం. ఈరోజు అన్నం తింటే సరీసృపాల రూపంలో జన్మిస్తారని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ వ్రతం విరమించే ద్వాదశి రోజున తప్పనిసరిగా అన్నం తినాలి. ఇక ఏకాదశి వ్రతంలో ముల్లంగి, బెండకాయ, ఆకు కూరలు, కాయధాన్యాలు, వెల్లుల్లి, ఉల్లిపాయల్లాంటివి వినియోగించరాదు. ఏకాదశి రోజు స్త్రీలను, పెద్దలను అవమానించవద్దు. బ్రహ్మచర్యం పాటించాలి. తులసి మొక్కలను తెంపకూడదు. ఇతరులపై చెడు ఆలోచనలు చేయరాదు.

**ముస్తాబైన ఆలయాలు..**

తొలి ఏకాదశికి వైష్ణవ ఆలయాలన్నీ సుందరంగా ముస్తాబయ్యాయి. ఏకాదశిని పురస్కరించుకొని బుధవారం వైష్ణవాలయాల్లో పూజలు చేయనున్నారు. తెలవారుజాము నుంచే అభిషేకాలు, అర్చనలు ఆయా ఆలయాల్లో అర్చకులు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆరుగంటలకు నిర్మాల్య విసర్జన, ఫలపంచామృతాభిషేకాలు, తులసి, పుష్పార్చనలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

నీళ్లు లేక బోసిపోయిన మక్తల్ పట్టణంలోని పెద్దచెరువు



# నీరుత్సాహం

- సాగు దయనీయం.. రైతన్నకు కష్టకాలం
- నారాయణపేట జిల్లాలో నిండని చెరువులు, కుంటలు
- వానకాలం నెలరోజులైనా లోటు వర్షపాతమే..
- వర్షాధారంగానే వ్యవసాయం
- ఆశనిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్న కర్షకులు

నారాయణపేట, జూలై 16 : నారాయణపేట జిల్లాలో చెరువులు, కుంటలు నిండితేనే పంటలకు సాగునీరు అందుతుంది. కానీ వర్షాకాలం ప్రారంభమై నెలన్నర రోజులు కావొస్తున్నా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. అప్పుడప్పుడు వర్షాలు కురుస్తున్నా సాగునీటి వనరులైన చెరువులు, కుంటల్లో మాత్రం ఆశించిన మేర నీరు వచ్చి చేరడం లేదు. దామరగిద్ద మండలంలో మొత్తం 72 చెరువుల ఉండగా 8 పెద్ద చెరువులు, 53 కుంటలు, 5 పర్కులేషన్ ట్యాంకులు, ఆరు ప్రైవేట్ చెరువులు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క చెరువులో కనీసం 70 శాతం నీళ్లు చేరలేదు. నారాయణపేట మండలంలో మొత్తం 189 చెరువులు ఉండగా వీటిలో 12 మైనర్ ఇరిగేషన్, 177 పంచాయతీరాజ్ చెరువులు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క చెరువులో కనీసం 65 శాతం నీళ్లు చేరలేదు. ఊట్కూరు మండలంలో 14 నోటిఫైడ్ చెరువులు, 23 కుంటలు ఉన్నాయి. ఈ చెరువులకు 50 శాతం మాత్రమే నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం రైతులు నారుమడులను సిద్ధం చేసుకున్నారు. మరో 15 రోజుల్లో వరి నాట్లు వేస్తారు. మాగనూరు మండలంలోని రెండు నోటిఫైడ్ చెరువులు, 63 చిన్న చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇప్పటి వరకు వీటిలో కేవలం 10 నుంచి 20 శాతం మాత్రమే వర్షపు నీరు చేరింది. మండలంలో ప్రస్తుతానికి ఇప్పుడిప్పుడే వరి సాగుకు సిద్ధమవుతున్నారు. కృష్ణ మండలంలో రెండు నోటిఫైడ్ చెరువులు, 44 చిన్న చెరువులు, కుంటలు ఉన్నాయి. 40 శాతం వరకు వర్షపు నీరుతో నిండినవి. మక్తల్ మండలంలో 11 నోటిఫైడ్ చెరువులు, 86 చిన్న చెరువులు, కుంటలు, 29 చెక్ డ్యాంలు ఉన్నాయి. ప్రస్తుతం చిన్న చెరువులు, కుంటలు 50శాతం వర్షపు నీటితో నిండినవి. మరికల్ మండలంలో 14 చిన్న, 6 పెద్ద చెరువులుండగా.. ఏదీ నిండలేదు. కన్మనూర్, తీలేరు, చిత్తనూరు, మాధ్వార్ చెరువుల కింద నాట్లు వేస్తున్నారు. అదేవిధంగా కోయిల్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో రైతులు నాట్లు వేస్తున్నారు. ధన్వాడ మండలంలో తొమ్మిది పెద్ద చెరువులు ఉన్నాయి. 10కుంటలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో బోర్ల కింద నాట్లువేస్తున్నారు. గున్ముక్ల చెరువులో మాత్రం కొంత నీరు వచ్చింది. మిగతా చెరువుల్లో నీరు చేరలేదు. ధన్వాడ పెద్ద చెరువులో కొంచెం నీరు వచ్చి చేరింది. మద్దూరు మండలంలో 46చిన్న చెరువులు, 12పెద్ద చెరువులు ఉన్నాయి. రెండు చిన్న చెరువులు, రెండు పెద్ద చెరువుల్లో 25 శాతం నీరు చేరింది. కోస్గి మండలంలో 69 చిన్న, ఏడు పెద్ద చెరువులు, మూడు కత్వలు ఉన్నాయి. వీటిల్లో 25 శాతం మాత్రమే నీళ్లు ఉన్నాయి. గుండుమాల్ మండలంలో 42 చిన్న, నాలుగు పెద్ద చెరువులు, మూడు కత్వలు ఉన్నాయి. వీటిల్లో 15 శాతం మాత్రమే నీరు చేరింది, కొత్తపల్లి మండలంలో 33 చిన్న, ఆరు పెద్ద చెరువులు ఉండగా ఇక్కడ కూడా 20 శాతం కూడా నీరు చేరలేదు.

**4.20 లక్షల ఎకరాల్లో సాగు..**

ఈ ఏడాది 4.20 లక్షల ఎకరాల్లో పంటలు పండించనున్నట్లు వ్యవసాయ అధికారుల అంచనా. ప్రధానంగా మక్తల్, నర్వ, మరికల్ మండలాల్లో భీమా, సంగంబండ, భూత్పూర్, కోయిల్‌సాగర్, ఎత్తిపోతల ప్రాజెక్టు ఆయకట్టు రైతులు వానకాలం వరి పంట సాగుకు సిద్ధమవుతున్నారు. మిగిలిన మండలాల్లో చెరువులు, కుంటలు బోరుబావులే ఆధారంగా వరి పండిస్తున్నారు. పలు మండలాల్లో ఇప్పటికే కొంతమంది నారుమడులు సిద్ధం చేసుకొని రేపోమాపో వరినాట్లు నాటేందుకు సిద్ధమవుతుండగా.. మరి కొందరు మాత్రం ఇప్పటికే నాట్లు వేశారు. పత్తి, కంది, పెసర, కుసుమ విత్తనాలు నాటగా మొలకెత్తాయి. వర్షాలు లేకపోవడంతో నాటిన విత్తనాలు ఎలా అనే సందిగ్ధ పరిస్థితి నెలకొన్న సమయంలో అడపాదడపా కురిసిన వర్షాలతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. ఒక దశలో అసలు ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తాయా లేదా అనే బెంగతో రైతులు వరుణ దేవుడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కొన్నిచోట్ల అయితే రైతులు తమతమ గ్రామాల్లో ప్రత్యేకంగా భజనలు చేస్తూ ఆలయాలకు వెళ్లి టెంకాయలు కొట్టి వరుణదేవుడు కరుణించే విధంగా చూడాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో జూన్‌లో 129.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 80.9 మి.మీ. వర్షపాతమే నమోదైంది. అంటే 62.47 శాతం మాత్రమే వర్షాపాతం కురిసినట్లు చెప్పవచ్చు. ఇక జూలైలో 15 రోజుల్లో 141.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 68.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంటే ప్రస్తుత జూలై మాసంలో కేవలం 48.30 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైనట్లు తెలుస్తుంది.

**జూన్‌లో వర్షపాతం (మిల్లీమీటర్లలో)**

| మండలం | కురవాల్సిన వర్షపాతం | కురిసిన వర్షపాతం |
|---|---|---|
| దామరగిద్ద | 115.5 | 82.5 |
| నారాయణపేట | 153.8 | 86.6 |
| ఊట్కూర్ | 158.7 | 82.3 |
| మాగనూరు | 100.1 | 83.2 |
| కృష్ణ | 130.8 | 76.3 |
| మక్తల్ | 94.8 | 69.0 |
| నర్వ | 100.9 | 74.9 |
| మరికల్ | 129.6 | 83.1 |
| ధన్వాడ | 137.5 | 90.0 |
| మద్దూర్ | 140.1 | 73.5 |
| కోస్గి | 112.7 | 91.7 |
| గుండుమాల్ | 198.7 | 83.5 |
| కొత్తపల్లి | 110.9 | 73.5 |

**జూలైలో వర్షపాతం (మిల్లీమీటర్లలో)**

| మండలం | కురవాల్సిన వర్షపాతం | కురిసిన వర్షపాతం |
|---|---|---|
| దామరగిద్ద | 135.9 | 65.2 |
| నారాయణపేట | 116.5 | 68.8 |
| ఊట్కూర్ | 114.6 | 70.7 |
| మాగనూరు | 133.1 | 65.4 |
| కృష్ణ | 127.0 | 65.8 |
| మక్తల్ | 110.1 | 62.1 |
| నర్వ | 171.6 | 66.7 |
| మరికల్ | 137.0 | 67.3 |
| ధన్వాడ | 141.6 | 69.4 |
| మద్దూర్ | 131.9 | 67.6 |
| కోస్గి | 149.5 | 79.6 |
| గుండుమాల్ | 214.6 | 73.9 |
| కొత్తపల్లి | 159.6 | 67.6 |



**పంట చేతికందుతుందో లేదో..**

ఈ ఏడాది అంతంత మాత్రమే వానలు కురుస్తున్నాయి. బోరు బావిలో నీరు సరిగ్గా లేకపోవడంతో పదెకరాలకు బదులు రెండు ఎకరాల్లో వరి సాగు చేసేందుకు కరిగెట చేసుకుంటున్నా రెండు మూడు పెద్ద వర్షాలు పడితే తప్పా చెరువులు, కుంటలు నిండే పరిస్థితి లేదు. పంట పండి చేతికి వచ్చేదాక భరోసా లేదు. పెట్టుబడులకు అప్పులు చేసినా దేవుని మీద భారం వేసి వరి సాగు చేస్తున్నా..

- కతలప్ప, రైతు, పులిమామిడి



జేపీఎన్‌సీఈ కళాశాల

# రేపటి నుంచే డీఎస్సీ

- ఆగస్టు 5 వరకు పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో రెండు కేంద్రాలు
- హాజరుకానున్న 11,500 మంది..

పాలమూరు, జూలై 16 : ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించే డీఎస్సీ–2024 పరీక్షకు జిల్లా జిల్లా యంత్రాగం, విద్యాశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2017 జూలైలో మొదటి డీఎస్సీ నిర్వహించారు. తర్వాత ఏడేండ్లకు నిర్వహిస్తున్న రెండో పరీక్ష ఇది. ఈ నెల 18నుంచి ఆగస్టు 5 వరకు మొత్తం 13 రోజులపాటు నిర్వహించే పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 11,500 మందికి పైగా అభ్యర్థులు హాజరు కానున్నారు. వీరి కోసం 2 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటిసారి ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరగనున్నాయి. ప్రతి రోజూ రెండు విడుతలుగా నిర్వహించే ఈ పరీక్షలు మొదటి విడుత ఉదయం 9 నుంచి 11:30 గంటల వరకు, రెండో విడుత మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4:30 వరకు ఉంటుంది. పీఈటీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ వారికి ఉదయం 9నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు, దివ్యాంగులైన అభ్యర్థులకు (సదరం సర్టిఫికెట్ ఉన్న వారికి) అదనపు సమయం కేటాయిస్తారు. పరిశీలకులుగా సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్లు, సీనియర్ హెచ్‌ఎంలను నియమించారు. మహబూబ్‌నగర్ గ్రామీణ మండలం ధర్మాపూర్ సమీపంలోని జేపీఎన్‌సీఈ కళాశాల, మహబూబ్‌నగర్ పట్టణం క్రిస్టియన్‌పల్లిలోని ఫాతిమా విద్యాలయంలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతంలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించిన చాలా సందర్భాల్లో కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, నిల్చునేందుకు గుడారాలు ఏర్పాటు చేయలేదు. ఈ పరీక్షలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉన్నది.

**అభ్యర్థులు పాటించాల్సిన నియమాలు..**

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు రెండు గంటల ముందే కేంద్రాలకు చేరుకోవాలి. నిర్ణీత సమయానికి గంటన్నర ముందు నుంచే కేంద్రాల్లోకి లోపలికి అనుమతిస్తారు. పరీక్ష నిర్ధేశిత సమయానికంటే పది నిమిషాల ముందే గేట్లు మూసివేస్తారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్, ప్రభుత్వ గుర్తింపు కార్డు, బాల్ పాయింట్ పెన్ను వెంట తెచ్చుకోవాలి. గడియారాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.


గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు చేరుకున్న జూరాల నీరు



# జూరాల టు గోపల్‌దిన్నె

- రిజర్వాయర్‌కు కృష్ణమ్మ పరుగులు
- రైతుల సంతోషం

వీపనగండ్ల, జూలై 16 : జూరాల ప్రాజెక్టు పరిధిలోని రామన్‌పాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి రెండు రోజులుగా నీటిని విడుదల చేస్తున్నారు. మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు జూరాల నీరు చేరడంతో అన్నదాతలు, మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 0.36 టీఎంసీ కెపాసిటీ గల గోపల్‌దిన్నె రిజర్వాయర్‌ను నింపితే ఉమ్మడి వీపనగండ్ల మండలానికి సంబంధించిన గోవర్ధనగిరి, వీపనగండ్ల, వెలగొండ, అమ్మాయిపల్లి, చిన్నదగడ, పెద్దదగడ, గూడెం, బెక్కెం, మియ్యాపూర్, గడ్డభాస్వపురం, లక్ష్మీపల్లి, కొప్పునూర్, పెద్దమారూర్, గోప్లాపూర్, కొండూరు తదితర గ్రామాల్లో దాదాపుగా 30వేల ఎకరాల్లో పంటలు పండించుకునే అవకాశం ఉన్నది. కొంతమంది రైతులు ఇదివరకే వరి తుకాలు పోసి వరి పంట సాగు చేసేందుకు ఏర్పాట్లు చేసుకోగా.. మరికొంత మంది గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు నీరు చేరుతుండడంతో పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. అయితే త్వరగా గోపల్‌దిన్నె రిజర్వాయర్‌ను నింపి సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



వరి తుకాలు పోసుకున్న ఆయకట్టు రైతులు

# వస్తున్నాం.. మల్లయ్యా..


- లొద్దిమల్లయ్య దర్శనానికి అనుమతి

అచ్చంపేట, జూలై 16 : నల్లమలలో వెలిసిన లొద్దిమల్లయ్య దర్శనానికి అటవీ శాఖ అనుమతినిచ్చింది. తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు కాలినడకన పుణ్యక్షేత్రానికి వెళ్లి దర్శించుకోవచ్చని అచ్చంపేట రేంజ్ అధికారి రాజేందర్ తెలిపారు. బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుమతి ఉన్నట్లు చెప్పారు. బయటినుంచి వచ్చే భక్తులకు, వాహనాలకు అనుమతి లేదన్నారు. కేవలం కాలినడకన వెళ్లాలని, అమ్మవారికి కోళ్లు, మేకలు బలి ఇవ్వడాన్ని నిషేధించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు తీసుకెళ్లొద్దని, గుండంలో స్నానమాచరించి తిరిగి రావాలన్నారు.

# ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

ధరూరు/అయిజ, జూలై 16 : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. జూరాల ప్రాజెక్టుకు 1,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 2,401 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. పూర్తి స్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 3.975 టీఎంసీల నిల్వ ఉన్నది. నెట్టెంపాడు లిఫ్టుకు 750, భీమా లిఫ్ట్–1కు 1151, భీమా లిఫ్ట్ –2కు 847, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. అలాగే టీబీ డ్యాంలో ఇన్‌ఫ్లో 36,170, అవుట్‌ఫ్లో 211 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాం గరిష్ఠనీటి నిల్వ 105.855 టీఎంసీల సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 35.473 టీఎంసీల నిల్వ ఉన్నది. 1,633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1,608.91 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘువేంద్ర తెలిపారు. బుధవారం తుంగ జలాశయం నుంచి వరద మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

కేసీఆర్ హయాంలో నీటితో కళకళలాడుతున్న కేఎస్పీ కుడి కాల్వ





నేడు నీరు లేక వెలవెలబోతున్న కేఎస్పీ కుడి కాల్వ

# నాడు జలకళ.. నేడు వెలవెల

*కేసీఆర్ ప్రభుత్వంలో నిండుగా పారిన కాల్వలు.. రేవంత్ సర్కారు రావడంతో నీళ్లు పారక వెలవెలబోతున్నాయి. గతేడాది జూలై మొదటి వారంలో కోయిల్‌సాగర్ నుంచి కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదలతో పంట పొలాల్లో కృష్ణమ్మ పరవళ్లు తొక్కింది. ప్రస్తుతం జూలై మూడో వారం ప్రారంభమైనా ప్రాజెక్టులో నీటిమట్టం 18 అడుగులకు చేరింది. ఇంకా ఆయకట్టుకు సాగునీరు విడుదల కాలేదు. దీంతో కెనాల్స్ అన్నీ ఒట్టిబోయాయి.*

- మరికల్, జూలై 16